ఇద్దరూ ఏవో కబుర్లు చెప్పుకున్నారు. కబుర్లు చెబుతున్నంత సేపూ శాంతి లలితని నిశితంగా మనోనేత్రంతో పరిశీలిస్తూనే ఉంది.

జీవితాన్ని ఈజీగా తీసుకోగలగటం చాల అదృష్టం. తనలా ఊరికే దేనికో స్పష్టంగా తెలియని దాని కోసం ఆత్రపడటం వల్ల ఉత్సాహం అనేది దూరంగా పోతోంది తన నుంచి. ప్రతి దాంట్లోనూ స్వచ్ఛత చూడటానికి ఎప్పుడూ ప్రయత్నించకూడదు.

మాట లయ్యాక లలిత - "అసలు మా ఇంటికే రావటం మానేశారు. ఒకసారి రండి" అని మరీ మరీ చెప్పింది. ఆమె ఆహ్వానంలో ఆప్యాయతకి శాంతి హృదయం కదిలింది.

"రేపు ఉదయం తప్పకుండా వస్తాను. ఇప్పుడు మీవారు వచ్చేస్తారేమో" అనేసింది గాని అప్రయత్నంగా ఉద్యోగం లేని మగాడు ఏ టైమ్‌లో నయినా ఇంట్లో ఉండవచ్చు, ఏ టైమ్‌లోనైనా బయటికి వెళ్ళొచ్చు అనుకుంది మళ్ళీ.

లలిత ఏ పనిపాటా లేని ఆ సోమరి భర్తని ఎలా భరిస్తోంది ? ఎలా నవ్వ గలుగుతోంది ? - ఈ ప్రశ్నలు ఆమె మదిలో పదే పదే మెదలసాగాయ్.

రేపు వెళ్ళినపుడు ఈ ప్రశ్నలకి సమాధానం వెతుక్కోవటానికి ప్రయత్నించాలి తను అనుకుంది నిశ్చయంగా.

*** *** ***

మర్నాడు శాంతి లలిత ఇంటికి వెళ్ళింది. లలిత చిరునవ్వుతో ఆహ్వానించింది.

కాఫీ, టిఫిన్లు తీసుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు. ఇలాం టపుడు ఎదుటి వారితో సమంగా మాట్లాడటానికి శాంతి చాల కష్టపడుతుంది. లలితతో మాట్లాడుతున్నా శాంతి మనస్సుని ఆ ప్రశ్నలు రెండూ వేధిస్తూనే ఉన్నాయ్. సమాధానం రాబట్టటం ఎలా ?

ఎంతసేపు కూర్చున్నా శాంతి మనస్సులో సందేహాలు అలాగే మిగిలిపోయాయ్. నిరుత్సాహంగా "ఇక వస్తాను" అంటూ లేచింది.

ఇద్దరూ మళ్ళీ కాస్సేపు గుమ్మం దగ్గర నిలబడ్డారు ఆడవాళ్ళ ఆనవాయితీ ప్రకారం. మళ్ళీ ఏవో కబుర్లు చెబుతోంది లలిత.

ఇంతలో వెనక వీధిలో ఉండే పార్వతి అటుగా వెళ్తోంది. నుదుటికి కట్టుకట్టి ఉంది.

లలిత అంది పార్వతి వైపు చూస్తూ - "చూడండి పాపం, రాత్రి చచ్చేట్టు కొట్టాట్ట ! ఎలా భరిస్తోందో బాబూ ఆ మొగుణ్ణి ? నే నయితే ఈ పాటికి ఏ నుయ్యో గొయ్యో చూసుకుందును !"

శాంతి లలిత మాటలకి ఉలిక్కిపడింది. ఆమె మస్తిష్కాన్ని తొలుస్తున్న ప్రశ్నలకి సమాధానం దొరికింది.

అవును మరి ! రోజూ సంపాదించి తెచ్చేది లేకపోగా హింసించే భర్త కన్నా సంపాదన లేకపోయినా భార్యని హింసించని భర్త నయం కాదూ ?

లలిత అసమర్థుడైన తన భర్తని సంతోషంగా ఎలా భరిస్తోందో శాంతికి స్పష్టంగా అర్థం అయింది. ఇంటికి వచ్చేసింది.

"అమ్మా ! అమ్మా ! ఈ గీతని చెరపకుండా చిన్నది చెయ్ !" శాంతి కొడుకు పలక, బలపం పుచ్చుకుని ఎదురువచ్చాడు. ఇంకోసారి అయితే ఆ సమస్య శాంతికి కాస్త జటిలంగా అనిపించే దేమో, కాని ఇప్పుడు కాదు. వెంటనే పలక తీసుకుని దాని మీద ఉన్న గీత పక్కన అంతకన్న పెద్ద గీత గీసింది.

కొడుకు ఆనందంగా చప్పట్లు చరిచాడు.

అసలు ప్రపంచమే ఈ సూత్రం మీద ఆధారపడి నడుస్తున్న దన్న విషయం, అందుకే ప్రతి మనిషీ నవ్వుతూ బ్రతకగలుగుతున్నాడన్న సత్యం శాంతికి ఆ రోజు అర్థమైంది. *

---

సుబ్బారావు: మా ఆవిడ డైటింగ్ చేస్తోంది. వారానికి రెండు కిలోల చొప్పున బరువు తగ్గుతోందట?

అప్పారావు: అయితే ఏంటి?

సుబ్బారావ్: ఆ ప్రకారం మరో ముప్ఫయ్ వారాల్లో నా పీడ విరగడౌతుంది.

-'జీవి'

"పాపం వరంధామయ్య గారికి భార్య పోయిందటగా! ఏకాంతంతో గడుపుతున్నా డన్నమాట, ఈ పెద్ద వయసులో" సుబ్బారావును అడిగాడు అప్పారావు.

"అవును. ఈ లోపల ఏ. కాంతం అనే ఆమెను చేరదీశాడు లే" సుబ్బారావు జవాబు.

సి. హెచ్. వి. బృందవనరావు, [నెల్లూరు]

---










